మాజీ ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

కృష్ణకాలనీ/ భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 30 : జిల్లా ప్రజలకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం వేర్వేరుగా ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం ప్రతి ఇంటిలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలను, కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పటాకులు కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులు తమ సమక్షంలో పటాకులు కాల్చే విధంగా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న గండ్ర

మంజూర్‌నగర్ వేంకటేశ్వరస్వామిని బుధవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాసర్ల దేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో గండ్ర పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవేందర్‌రెడ్డి చేత కేక్‌కట్ చేయించి స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజుపటేల్, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, నాయకులు సెగ్గం సిద్ధు, కరాటే శ్రీనివాస్, అశోక్, బుర్ర మనోజ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 30 : వయోజన విద్య – నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన వయోజన విద్యాశాఖ నవభారత సాక్షరత కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సర్వే ద్వారా పురుషులు 19,639 మంది, స్త్రీలు 35,158 మంది, మొత్తం 54,777 మంది నిరక్షరాస్యులు జిల్లాలో ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో ప్రస్తుతం పురుషులు 7,854 మంది, స్త్రీలు 11,782 మంది, మొత్తం 19,636 మంది టార్గెట్‌గా తీసుకున్నామని చెప్పారు. జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం, డీఆర్‌డీఏ విభాగం సహాయక బృందాలు, డీఐఏ విభాగం ఇంటర్మీడియట్ విద్యార్థుల ద్వారా, జిల్లా మున్సిపాలిటీ పరిధిలో స్వయం సహాయక బృందాల ద్వారా, జిల్లా సంక్షేమ అధికారి అంగన్‌వాడీ టీచర్ల ద్వారా, జిల్లా వైద్యాశాఖ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల ద్వారా వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎం రాజేందర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీఐవో వెంకన్న, డీఆర్డీఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను తీసుకెళ్లిన ఘటనలో ఇద్దరి రిమాండ్

మహదేవపూర్, అక్టోబర్ 30 : బాలికను తీసుకెళ్లిన ఘటనలో ఇద్దరిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలానికి చెందిన ఓ మహిళ తన కూతురు (17) భూపాలపల్లిలోని హాస్టల్‌కు వెళ్తున్నానని చెప్పి ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లింది. 11న హాస్టల్ సిబ్బంది ఫోన్ చేసి మీ కూతురు ఇంకా హాస్టల్‌కు రాలేదని తెలిపారు. దీంతో కంగారుపడిన మహిళ అదే రోజున మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి మహదేవపూర్ బస్టాండ్‌లో బాలిక వేరే వ్యక్తితో కనిపించడంతో పోలీసులు వెంటనే వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలిక స్టేట్‌మెంట్‌ను మహిళా కానిస్టేబుల్‌తో రికార్డు చేయించి, తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఆ అబ్బాయిని విచారించగా అతను పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామానికి చెందిన లింగీ రాజశేఖర్‌గా తేలిందన్నారు. బాలిక తను చదివే కాలేజీలో పరిచయం చేసుకొని ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని, నువ్వు లేకపోతే చచ్చిపోతానని బెదిరించి ఇంటి నుంచి తన మిత్రుడైన లెంకలగడ్డ గ్రామానికి చెందిన మడప బాపు సాయంతో తీసుకెళ్లాడు. వారిద్దరూ కలిసి దేవాలయాలు, సత్రాల్లో తిరుగుతూ ఇన్ని రోజులు గడిపాడని తెలిపారు. బాలికను అలా తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమైనందున పోలీసులు లింగి రాజశేఖర్, అతడికి సహకరించిన మడప బాపును అరెస్టు చేసి బుధవారం కోర్టు ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో విద్యార్థుల హవా

వెంకటాపూర్/ఏటూరునాగారం, అక్టోబర్ 30 : వెంకటాపూర్ మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో సత్తాచాటారు. కళాశాలకు చెందిన పీ వేదజేష్టిత, ఎస్ శన్విత క్రికెట్‌లో, బీ అశ్విత హాకీలో, ఎండీ సన బాల్‌బ్యాడ్మింటన్‌లో, ఎండీ యాస్మిన్ హ్యాండ్‌బాల్‌లో, కే వర్షిణి సేపక్‌తక్రాలో, ఎస్‌కే ఇర్ఫానా షటిల్‌లో, ఎండీ సమీనా ఫుట్‌బాల్‌లో, ఎండీ హప్స ఫుట్‌బాల్ క్రీడలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వందన తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, పీడీ టీ నవ్య, కళాశాల బృందం అభినందించారు.

రాష్ట్రంలో పడిపోతున్న కాంగ్రెస్ గ్రాఫ్

- **రేవంత్‌రెడ్డి పాలనను ఛీకొడుతున్న ప్రజలు**
- **డబుల్ బెడ్ రూమ్‌లను స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వాలని చూస్తున్నడు**
- **మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

కృష్ణ కాలనీ, అక్టోబర్ 30 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ సమయంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను కూడగట్టుకున్నదని, రేవంత్‌రెడ్డి చేస్తున్న పాపాలతో కాంగ్రెస్ గ్రాఫ్ క్రమక్రమంగా పడిపోతున్నదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని బీఆర్ఎస్ సమర్థవంతంగా ఆపడంలో విజయం సాధించిన సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ పది నెలల్లోనే రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేయడంతో, ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని బీఆర్ఎస్ పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించగలిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి ఇప్పటి వరకు ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించడం ఇదే ప్రథమమన్నారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు, బీఆర్ఎస్‌ది అన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడం

కాంగ్రెస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నాయకులు పోరాటం చేస్తుంటే అధికార గర్వంతో తమ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని గండ్ర అన్నారు. ఇటీవల మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో దీపావళి సందర్భంగా పెద్ద బాంబులను పేల్చుతున్నామని మీన మేషాలు లెక్కిస్తూ మాట్లాడుతున్నారని, మంత్రులు ఏ బాంబులు పేల్చినా ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్‌కు ఉందన్నారు. బీఆర్ఎస్ పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్‌లు పంపిణీ చేయాలి

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించామని, అదే రోజే లబ్ధిదారుల ఎంపిక కూడా జరిగిందని గండ్ర తెలిపారు. మరో 30 నిమిషాల్లో లబ్ధిదారులకు పట్టాలు కూడా పంపిణీ చేసే వాళ్లమని, అనుకోకుండా ఎన్నికల కోడ్ రావడంతో పట్టాలు ఇవ్వలేకపోయామన్నారు. నేడు గెలిచిన ఎమ్మెల్యే లబ్ధిదారులను పక్కనపెట్టి కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు చూపించిన వ్యక్తులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నడన్నారు. దీపావళి లోపు ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వకుంటే తాళాలు పగలగొట్టి గృహ ప్రవేశం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్‌యాదవ్, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, జక్కం రవికుమార్, ఎడ్ల మౌనిక శ్రీనివాస్, మంగళపల్లి తిరుపతి, బానోత్ రజితా జుమ్ములాల్, దార పూలమ్మ, ముంజంపల్లి మురళీధర్, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, ఆలయ కమిటీ చైర్మన్ కుమార్‌రెడ్డి, నాయకులు బండారి రవి, పోలవేణి ప్రసాద్, మాడ హరీశ్‌రెడ్డి, సింగనవేణి చిరంజీవి, మామిడి కుమార్, నలిగేటి సతీశ్‌కుమార్, కృష్ణమూర్తి, పిల్లి వేణు, ఎండీ కరీం, పోలవేణి అశోక్, యూత్ నాయకులు శ్రీకాంత్ పటేల్, భాస్కర్, రాజ్‌కుమార్, రాకేశ్, ప్రేమ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు తిరుపతమ్మ, మహిళా నాయకులు భాగ్య, పుష్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనరసింహారావు, చెల్పూర్ మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, శాయంపేట మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతిగౌడ్

తిరుపతిగౌడ్

గణపురం, అక్టోబర్ 30 : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పెరుమాండ్ల తిరుపతిగౌడ్ ఎన్నిక య్యారు. బుధవారం మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుందురుపల్లి కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారున. గౌరవ అధ్యక్షుడిగా కోరె రమేశ్, అధ్యక్షుడిగా పెరుమాండ్ల తిరుపతి గౌడ్, కార్యదర్శులు యంసాని సంతోష్, కాసిడి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అల్లూరి రవీంద ర్ రెడ్డి, పిట్ట భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటస్వామి, జాయింట్ సెక్రెటరీగా తుమ్మల రవి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నల్ల బెల్లి అభినవ్ రావు, సలహాదారులుగా ఫోరండ్ల సంతోష్, ఈసీ సభ్యులుగా అల్లూరి రవీందర్‌రెడ్డి, అంకిల్ల రఘుపతిరెడ్డిరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మహదేవపూర్, అక్టోబర్ 30 : మండల కేం ద్రంతోపాటు మండల పరిధిలోని బొమ్మాపూ ర్, అంబట్‌పల్లి గ్రామా ల్లో ఇటీవల మృతి చెంది న పలు కుటుంబాలను మంథని నియోజకవర్గ బీ ఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, మాజీ ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, యూత్ అధ్యక్షుడు అలీంఖాన్, సీనియర్ నాయకులు ఆన్కారి ప్రకాశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జక్కయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరుకూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ

వాజేడు, అక్టోబర్ 30 : మండలంలోని చెరుకూరు గ్రామంలోని 163జాతీయ రహదారిపై రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం జిల్లా పౌరసరఫరాల అధికారి బీ రాంపతి తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఇక్కడ చెక్‌పోస్టులో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ, సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ధాన్యంకు సంబంధించిన వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. అనుమతి పత్రాలు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు.

కేటీపీపీలో నిఘా అవగాహన వారోత్సవాలు

గణపురం, అక్టోబర్ 30 : మండలంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ చిట్టాప్రగడ శ్రీప్రకాశ్ ఆధ్వర్యంలో (విజిలెన్స్ అవేర్నెస్ వీక్) నిఘా అవగాహన వారోత్సవాలు వేడుకలను బుధవారం సర్వీస్ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ శ్రీప్రకాశ్ మాట్లాడుతూ దేశాల శ్రేయస్సు కోసం సమగ్రతకు నిఘా ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీలోని అన్ని విభాగాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డివిజనల్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు,వివిధ ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు, మహిళా ఉద్యోగులు,అర్టీజన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ టోర్నమెంట్

కాటారం, అక్టోబర్ 30 : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కబడ్డీ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతున్నది. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన క్రీడాకారులు ప్రతిభను చాటుతున్నారు. పీఈటీలుగా కార్తీక్, రాజు, శేఖర్, అంకుస్, శ్రీను, కిరణ్, ఓదెలు వ్యవహరిస్తున్నారు. స్మరణ్, కిశోర్, రాజు, ఈశ్వర్, విష్ణు పాల్గొన్నారు.

ఏటూరునాగారంను మున్సిపాలిటీగా ప్రకటించాలి

ఏటూరునాగారం, అక్టోబర్ 30 : ఏటూరునాగారంను మున్సిపాలిటీగా ప్రకటించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలో 20వేలకు పైగా జనాభా ఉన్నందున 2019 మున్సిపాలిటీ చట్టం ప్రకారం ఏటూరునాగారంను మున్సిపాలిటీగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, యాకూబ్‌పాషా, గద్దల హరిబాబు, జానకీరావు, సాంబయ్య, రాజు, రవి పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

కన్నాయిగూడెం, అక్టోబర్ 30 : ఏటూరులో పట్టా భూముల పేరుతో గోదావరి మధ్యలో తవ్వకాలు చేస్తున్నారని నిరసిస్తూ బుధవారం గ్రామస్తులు ఇసుక క్వారీ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ అక్కడికి చేరుకోవడంతో అతన్ని నిలదీశారు. పట్టా భూములు ఉన్నది ఒకచోట, మరో చోట తవ్వకాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్

ప్రవీణ్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్

ములుగు, అక్టోబర్ 30(నమస్తేతెలంగాణ) : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఇంచర్లలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాన్ని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంప నాగేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పల్లెపాలి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిజాల సహోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరినాథ్, ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, అక్కల రఘోత్తం, సంయుక్త కార్యదర్శులు భద్రయ్య, వీ.ఎన్.రెడ్డి, ఈసీ మెంబర్లు లక్ష్మీనారాయణ, ఎలేందర్, శాశ్వత ఆహ్వానితులు అనిల్‌కుమార్, శ్రవణ్‌కుమార్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు సంపత్‌కుమార్, జగన్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బైకాని సాగర్, దుర్గం రమణయ్య, కోగిల మహేశ్ పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం

నిలిచిన విద్యుత్ సరఫరా

గోవిందరావుపేటలో నేలవాలిన వరి పంట

వాజేడు/గోవిందరావుపేట/ఏటూరునాగారం/కన్నాయిగూడెం/కాటారం/గణపురం, అక్టోబర్ 30 : పలు మండలాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆయా మండలాల్లో వరి కోతకు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల వరి పంట నేలవాలింది. పలుచోట్ల ఇప్పటికే కోసిన ధాన్యం రాశులు తడిశాయి. రైతులు కల్లాల వద్దకు చేరుకుని ధాన్యం రాశులపై పరదాలు కప్పారు. కాగా, వివిధ పనులపై బయటికి వెళ్లిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడ్డారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను వర్షంతో మూసివేశారు. పంటనష్టంపై సర్వే చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, జనగామ, కేసముద్రం మార్కెట్‌లో వరిధాన్యం తడిసి ముద్దయింది.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత

కాటారం, అక్టోబర్ 30 : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రవ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలనే తలంపుతో పలువురు ముందుకొచ్చారు. బుధవారం ఫర్టిలైజర్స్, సీడ్స్ అసోసియేషన్ నాయకులు కాటారం సీఐ నాగార్జునరావుకు తమ వంతుగా రూ.లక్ష విరాళం అందించినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రూ. 2లక్షలు, బ్రిక్స్ అసోసియేషన్ నాయకులు రూ.33వేలు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య రూ.25వేలు, కాటారం మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ రూ.21వేలు అందించినట్లు పోలీసులు చెప్పారు. కార్యక్రమాల్లో ఎస్సై అభినవ్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కవ్వాల శేఖర్, ఉపాధ్యక్షులు అల్లాడి చంద్రమౌళి, కొత్త రాజేందర్, కోశాధికారి బచ్చు ప్రభాకర్, ప్రచార కార్యదర్శి నిడిగొండ చెన్నకేశవ్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు అమర్చుకోవాలి

కృష్ణకాలనీ, అక్టోబర్ 30 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సీఐ నరేశ్‌కుమార్ అనారు. 8వ వార్డు జవహర్‌నగర్ కాలనీలో ఆరు సీసీ కెమెరాలను ఆ కాలనీ ప్రజలు ఏర్పాటు చేసుకోగా బుధవారం సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, కాలనీ ప్రజలు రాజేందర్, తిరుపతి గౌడ్, కొత్తూరి రవీందర్, మహిళలు పాల్గొన్నారు.

నీటిని నిల్వ చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 30 : నీటిని నిల్వ చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని భూగర్భ జలశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం భూగర్భ జలాల అభివృద్ధి వినియోగంపై పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూగర్భ జలాల వినియోగం, నీటి ఆవశ్యకతపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వ్యాకరణ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైడ్రాలజిస్ట్ రామకృష్ణ, సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీవో ఫౌండర్ రాజ్‌కమల్ రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట స్వామి, చైల్డ్‌లైన్ డిపార్ట్‌మెంట్ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ గుర్రం తిరుపతి, పాఠశాల హెచ్ఎం శాంత, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శిరీష, నిర్వహణ అధికారులు, సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్స్ ఇనుగోల అశోక్, బలగూరి వెన్నెల, కవిత, స్వప్న పాల్గొన్నారు.

'రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటాలి'

ఏటూరునాగారం, అక్టోబర్ 30 : రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి ఏటూరునాగారం ఐటీడీఏ పేరు నిలబెట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచం పిలుపునిచ్చారు. స్థానిక కుమ్రంభీం స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఐదో జోనల్ లెవల్ స్పోర్ట్స్, గేమ్స్ బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి పోచం హాజరై మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల ఉట్నూరులో జరిగే క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటాలని కోరారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏటీడీవోలు దేశ్‌రాం నాయక్, క్షేత్రయ్య, డిప్యూటీ ఈవో సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్లు శ్యామలత, ఆదినారాయణ, కిస్టు, నారాయణ, కొమ్మాలు, పీజీహెచ్ఎంలు నాగేశ్వర్‌రావు, కే శ్రీనివాస్, పీ శ్రీనివాస్, రేవతి, సుగుణావతి, పీఈటీలు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు సుమారు 1500మంది వరకు పాల్గొన్నారు.

రైతు వేదికలో శిక్షణ

ములుగురూరల్, అక్టోబర్30 : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో 80మంది డీలర్లకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సీహెచ్ తేజోవతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డీలర్లకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆర్ ఉమారెడ్డి హాజరై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ములుగు ఏడీఏ సురేశ్‌కుమార్, ఏటూరునాగారం ఏటీడీఏ చేరాలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ సేవలు విస్తృతం

ములుగురూరల్, /ఏటూరునాగారం/కృష్ణ కాలనీ, అక్టోబర్ 30 : విద్యుత్ వినియోగదారులకు టోల్ ఫ్రీ సేవలు మరింత విస్తృతం చేస్తున్నట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ బీ మల్సూర్, ములుగు డీఈఈ నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు 24గంటలపాటు టోల్ ఫ్రీ నంబర్ 1912 అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

పోలీసు బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

గోవిందరావుపేట, అక్టోబర్ 30 : పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చల్వాయి గ్రామంలోని తెలంగాణ స్పెషల